నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బచ్చన్నపేట, డిసెంబర్ 26 : మండలంలోని అన్ని గ్రామాల్లో నేడు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు త్రీఫేజ్ కరెంటు సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బచ్చన్నపేట సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మండలంలోని అన్ని గ్రామాల్లో త్రీఫేజ్ విద్యుత్ నిలిపివేస్తున్నామని వెల్లడించారు. సింగిల్‌ఫేజ్ కరెంటు యథాతథంగా ఉంటుందని తెలిపారు. రైతులు సహకరించాలని ఆయన కోరారు.

5న జీడికల్ అంగడి వేలం

లింగాలఘనపురం, డిసెంబర్ 26 : ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరో భద్రాద్రిగా పేరొందిన జీడికల్ శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం అధ్వర్యంలో నిర్వహించే అంగడి వేలాన్ని జనవరి 5న నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శేషుభారతి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రతి శనివారం అంగడి జరుగుతుందన్నారు. 2024-2025 సంవత్సరానికిగాను అంగడి హక్కులు పొందేందుకు సీల్డ్ కవర్, బహిరంగ వేలానికి టెండర్లు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తిగల టెండరుదారులు రూ.3వేలు చెల్లించి షెడ్యూలు ఫారాలను జీడికల్ ఆలయంలో కొనుగోలు చేయాలన్నారు. టెండరుదారుడు రూ.3లక్షల విలువైన డీడీని జత చేసి జనవరి 4 వరకు ఆలయంలోని కార్యాలయంలో అందజేయాలని కోరారు. జనగామలోని కలెక్టర్ కార్యాలయంలో జనవరి 5న మధ్యాహ్నం 12గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు. పూజారులు మురళీకృష్ణమాచార్యులు, భార్గవాచార్యులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి ప్రశాంత్

విధుల్లో అలసత్వాన్ని సహించం : డీఎంహెచ్‌వో

బచ్చన్నపేట, డిసెంబర్ 26 : వైద్యశాఖలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి ప్రశాంత్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. ప్రశాంత్ మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో వైద్యులు, సిబ్బంది ముందుండాలన్నారు. దవాఖాన ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రజలు సైతం కుళాయిలను వారంలో ఒకసారి శుభ్రం చేయాలని కోరారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వేడి చేసి చల్లార్చిన నీటినే తాగేలా సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సిద్ధార్థరెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

30న జనగామలో లోక్ అదాలత్

రఘునాథపల్లి, డిసెంబర్ 26: జనగామ జిల్లా కేంద్రంలోని కోర్టులో ఈనెల 30న నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై రఘుపతి తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. కేసులున్న వారు రాజీపడి కోర్టుకు హాజరైతే వాటిని కొట్టివేస్తారని తెలిపారు. యాక్సిడెంట్, దాడులు, చీటింగ్ అంశాల్లో కేసులున్నా, వివాహ బంధానికి సంబంధించిన కేసులు, చోరీలపై రాజీపడితే సంబంధిత కేసులను నేషనల్ లోక్ అదాలత్‌లో ఇరువురి సమ్మతితో పరిష్కరించుకోవచ్చన్నారు. ఆధార్‌కార్డు, ఇతర వివరాలతో కోర్టుకు హాజరుకావాలని సూచించారు.

బోనాల వేడుకలకు సిద్ధమైన పెద్దమ్మతల్లి ఆలయం

నేడు పాలకుర్తిలో పెద్దమ్మ తల్లి బోనాలు

ఆలయంలో అమ్మవారు

పాలకుర్తి, డిసెంబర్ 26: ముదిరాజ్‌ల ఆరాధ్యదైవమైన మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో బుధవారం బోనాల పండుగ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేసినట్లు మత్స్య సొసైటీ అధ్యక్షుడు దాసరి మధు, కార్యదర్శి దేశబోయిన అశోక్ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ బోనాల పండుగకు శాసనమండలిలో డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఈటల రాజేందర్, స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి హాజరవుతారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తరాల చంద్రబాబు, మామిండ్ల యాకయ్య, మామిండ్ల సోమయ్య, దుంపలి సంపత్, జీడి నిరంజన్, నాగరాజు, నరేందర్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024, 9640400073.
NT-314383

అమ్మబడును

★సుబేదారి నందు గల గర్ల్స్ హాస్టల్ ఫర్నిచర్‌తోని అమ్మబడును. హాస్టల్లో ఉండి వంట చేయుటకు వంట మనిషి కావలెను. (లేడీస్). సంప్ర: 8328620934.
NTW-00

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
9182777213
WARANAGAL
9182777556
9182777557
9182777558
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

మ్యానిఫెస్టోను చిత్తశుద్ధితో అమలు చేయాలి

- కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు కాదు.. 412 హామీలు నెరవేర్చాలి
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

శివునిపల్లిలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబర్ 26 : ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చామని చెబుతున్న కాంగ్రెస్ పాలకులు ఎన్నికల మ్యానిఫెస్టోలో 412 హామీలు ఇచ్చారని, వీటిలో ఒకటి మాత్రమే అమలుచేశారని మిగతావన్నీ నెరవేర్చాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం శివునిపల్లిలో నిర్వహించిన స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాల విస్తృత స్థాయి సమావేశం, కృతజ్ఞత సభకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ముందుగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గ్రామాల వారీగా లభించిన ఓట్ల శాతాన్ని సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పేర్కొన్న 412 హామీలు ఉన్నాయని వీటిలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం మాత్రమే అమలు చేశారని మిగతావన్నీ నెరవేర్చాలన్నారు. పేద మహిళలకు నెలకు రూ.2500, రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ అమలు చేయలేదని చెప్పారు. ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి వాటిని అమలు చేయకుండా శ్వేతపత్రాల పేరిట కాలయాపన చేస్తున్నదన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో అప్పులు పెరిగాయని ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో జరిగిన అభివృద్ధి కంటికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అభివృద్ధి కోసం అప్పులు చేశాం తప్ప అవినీతికి పాల్పడలేదని శ్రీహరి స్పష్టం చేశారు. రాష్ట్రంలో మౌలిక వసతులతోపాటు ఆస్తులను పెంచామని, గురుకులాలు కట్టించామని, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించామని గుర్తుచేశారు. వ్యవసాయానికి ఉచితంగా నిరంతర విద్యుత్ అందించామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పినా నేటికీ అమలు చేయలేదన్నారు. రైతుబంధు ద్వారా ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఎకరంలోపు రైతులకు సైతం సాయం అందించలేదని కడియం ధ్వజమెత్తారు.

నిధులు కేటాయించి పనులు పూర్తిచేయాలి

కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్ పాలనలో నియోజకవర్గాల అభివృద్ధికి మంజూరు చేసిన పనులు పూర్తిచేసేలా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. నిధులు లేవనే సాకుతో పనులు చేపట్టకుంటే ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. వంద రోజుల్లో హామీలు అమలుచేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తాము ఆరు నెలల గడువు ఇస్తున్నామని, అప్పటికీ నెరవేర్చకుంటే ప్రజలతో కలిసి పోరాటం చేస్తామన్నారు. వచ్చే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు 39 మంది ఎమ్మెల్యేలున్నారని కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎన్నికల్లో తన విజయానికి కృషిచేసిన పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్టేషన్ ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీగా మార్చి, నియోజకవర్గ కేంద్రానికి మంజూరైన 100 పడకల దవాఖాన కోసం కృషిచేస్తానన్నారు. దేవాదుల ద్వారా 35 గ్రామాలకు సాగునీరు అందడం లేదని, ఏడాదిలోగా కాల్వల మరమ్మతులు పూర్తి చేసి చెరువులు, కుంటలకు నీరందించేలా చూస్తామన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్ అధ్యక్షతన సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి, జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు, చిల్పూరు మండల అధ్యక్షుడు రమేశ్‌నాయక్, ఎంపీపీలు కందుల రేఖాగట్టయ్య, సరితాబాలరాజు, నియోజకవర్గ కోఆర్డినేటర్ మనోజ్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండలాల అధ్యక్షులు పోగుల సారంగపాణి, మామిడాల లింగారెడ్డి, ఎంపీటీసీలు బూర్ల లతాశంకర్, రజాక్ యాదవ్, గుర్రం రాజు, గన్ను నర్సింహులు, మార్కెట్ వైస్ చైర్మన్ చందర్‌రెడ్డి, నాయకులు చేపూరి వినోద్, గట్టు రమేశ్, అక్కనపల్లి బాలరాజు, సింగపురం జగన్, స్వామినాయక్, రంగు రమేశ్, ఇల్లందుల విజయ్, సంపత్ రాజు, పల్లె శ్రీనివాస్, అంబటి కిషన్ రాజు, సట్ల సురేశ్, పల్లె రవి పాల్గొన్నారు.

జనవరి 1నుంచి శ్రీరాముడి అక్షింతల పంపిణీ

మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చందర్‌బాబు

పాలకుర్తి, డిసెంబర్ 26 : అయోధ్యలోని శ్రీరాముడిని పూజించిన అక్షింతలను వచ్చే నెల 1నుంచి15వ తేదీ వరకు గ్రామాల్లో పంపిణీ చేయనున్నట్లు విశ్వహిందూ పరిషత్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందాల చందర్‌బాబు, విభాగ్ ప్రచారక్ విగ్నేష్‌జీ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీచండికా అమ్మవారి ఆలయంలో వారు పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ జనవరి 22న అయోధ్యలో శ్రీరామ జన్మభూమిలో నిర్మిస్తున్న నూతన మందిరంలోని శ్రీబాల రాముని విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, మండల అధ్యక్షుడు చీదురాల కృష్ణమూర్తి, జిల్లా బౌదిక్ ప్రముఖ్, ఎర్రం రమేశ్, మత్తగజం నాగరాజుశర్మ, గంగు నవీన్‌శర్మ, వేల్పుల దేవరాజ్, గజ్జి సంతోష్‌కుమార్, బైకాని నాగరాజు, పసులాది నాగరాజు పాల్గొన్నారు.

గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులకు సన్మానం

విద్యార్థులను సన్మానిస్తున్న చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు

చిల్పూరు, డిసెంబర్ 26 : కాకతీయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అంతర్ కళాశాలల చాంపియన్‌షిప్ పోటీల్లో పల్లగుట్ట గ్రామానికి చెందిన విద్యార్థులు గాజర్ల ఉదయ్ కిరణ్, ఇసురం బన్నీలు 1500 మీటర్లు, 800 మీటర్ల పరుగుల పోటీలో బంగారు పతకం సాధించారు. విద్యార్థులను చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు సన్మానించి అభినందనలు తెలిపారు. ఆర్థిక సాయంగా ఉదయ్ కిరణ్‌కు రూ.10వేలు, బన్నీకి రూ.5వేలు నగదును అందజేశారు. డిసెంబర్ 29న ఒడిస్సా, భువనేశ్వర్‌లో జరిగే నేషనల్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌కి ఉదయ్‌కిరణ్ ఎంపికైనట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ చిర్ర నాగరాజు, బీఆర్‌ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పేరాల సుధాకర్, సోషల్ మీడియా ఇన్‌చార్జి బాశెట్టి జయప్రకాశ్, జీడి ఆనందం, జీడి రమేశ్, అశోక్‌పాల్, రాములు, బాపునాయక్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి , మంగళపల్లి జనార్దన్

జనగామ చౌరస్తా, డిసెంబర్ 26 : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 99వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో మంగళవారం పార్టీ జెండాను మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రమ జీవుల హక్కు ల రక్షణ కోసం సీపీఐ ఆవిర్భవించిందని తెలిపారు. కేంద్రంలోని మతతత్వ బీజేపీ పాలనలో ప్రైవేట్ కార్పొరేట్ శక్తుల ఆధిపత్యం పెరిగిందన్నారు. దీనిపై సీపీఐ పోరాటం చేస్తుందన్నారు. ప్రజల పక్షాన నిత్యం తమ పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల శ్రీనివాస్, ఆది సాయన్న, మంగళంపల్లి జనార్దన్, చొప్ప రి సోమయ్య, చామకూర యాకూబ్, గుర్రం మధు, మోటె శ్రీశైలం, నీల యాదగిరి, సుదర్శన్, దయానగేశ్, గొలనుకొండ నాగరాజు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్ ఘన్‌పూర్ : మండల కేంద్రంలోని బస్టాండు సమీపంలో సీపీఐ జెండాను ఆ పార్టీ మండల కార్యదర్శి తోట రమేశ్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలతోపాటు నిరుద్యోగం పెరిగిందన్నారు. దీనిపై సీపీఐ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో సముద్రాల రాజు, బుర్ర యాదగిరి, నాగరాజు, సాయిలు, రాజయ్య, ఆశీర్వాదం, అజయ్ పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో

బచ్చన్నపేట : సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకున్న మంగళవారం బచ్చన్నపేట, ఆలింపూర్, కొడవటూరు, నాగిరెడ్డిపల్లి, పోచన్నపేట గ్రామాల్లో పార్టీ నాయకులు అరుణ పతాకాలను ఆవిష్కరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మంగళంపల్లి జనార్దన్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిత్యం పోరాడేది సీపీఐ మాత్రమేనన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బంటు పాండు, నాయకులు ఉమెంతల వెంకట్‌రెడ్డి, రాపెల్లి శాంతయ్య, సుద్దాల యాదగిరి, బుట్టెడ్డి ప్రతాపరెడ్డి, మల్లం రమేశ్, బండి కమలమ్మ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

బాధితుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 26 : మండలంలోని చాగల్లుకు చెందిన దోమల అరుణ్‌కుమార్‌కు సీఎంఆర్‌ఎఫ్‌లో మంజూరైన రూ.3 లక్షల సాయాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అందించారు. అరుణ్‌కుమార్ అనారోగ్యానికి గురై దవాఖానలో చికిత్స పొందిన నేపథ్యంలో వైద్య ఖర్చుల కోసం నిధులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో మంగళవారం హనుమకొండలో నిర్వహించిన కార్యక్రమంలో అరుణ్‌కుమార్‌కు చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో చాగల్లు సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పోగుల సారంగపాణి, బీఆర్‌ఎస్ గ్రామ యూత్ అధ్యక్షుడు పొన్న రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

చిల్పూరులో..

చిల్పూరు : మండలంలోని చిన్నపెండ్యాలకు చెందిన తాళ్లపల్లి వెంకటయ్య అనారోగ్యంతో దవాఖానలో చేరగా వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్‌లో రూ.1.50 లక్షలు మంజూరైన చెక్కు ఎమ్మెల్యే కడియం శ్రీహరి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ పాలన కొనసాగిందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎడ్లవెల్లి కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు భూక్యా రమేశ్‌నాయక్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మామిడాల లింగారెడ్డి, జాతీయ చేనేత సెల్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజ్జెల దామోదర్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ జనగామ యాదగిరి, గౌడ సంఘం మండల అధ్యక్షుడు తాళ్లపల్లి జగన్నాథం, మాజీ సర్పంచ్ సమ్మయ్య, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు ఇల్లందుల హరిబాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీల బహూకరణ

సీఐ చేతుల మీదుగా కుర్చీలను అందిస్తున్న రాజు

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 26 : మండలంలోని ఇప్పగూడెంలోని ఆరు అంగన్‌వాడీ కేంద్రాలకు మంగళవారం రాఘువాపూర్‌కు చెందిన మాజీ వార్డు సభ్యుడు బట్టమేకల రాజు కుర్చీలను బహూకరించారు. ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి ఐదు చొప్పున మొత్తం 30 కుర్చీలను అందించారు. తన తండ్రి వెంకటయ్య జ్ఞాపకార్థం స్థానిక సీఐ సట్ల రాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సీఐ సట్ల రాజు మాట్లాడుతూ సామాజిక సేవలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ జక్కుల పరశురాములు, ఉప సర్పంచ్ పోకల లక్ష్మీనర్సయ్య, కారోబార్ కొడెపాక శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు ఎస్ విజయ, డీ ఉపేంద్ర, మంజుల, రేణుక, పార్వతి, రజిత పాల్గొన్నారు.

హెల్త్ సెంటర్‌లో సాధారణ ప్రసవం

పాపతో ఎస్‌కే సభ

కొడకండ్ల, డిసెంబర్ 26 : మండల కేంద్రానికి చెందిన ఎస్‌కే యాకూబ్ సతీమణి ఎస్‌కే సభ పురిటి నొప్పులతో మంగళవారం స్థానిక పీహెచ్‌లో చేరగా సాధారణ ప్రసవం జరిగింది. 108 సిబ్బంది సహకారంతో నార్మల్ డెలివరీ జరిగి పాప జన్మించినట్లు డాక్టర్ హరికృష్ణ తెలిపారు. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని వివరించారు.

విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న నాయకులు

ఘనంగా పెన్షనర్స్ డే వేడుకలు

జనగామ చౌరస్తా, డిసెంబర్ 26 : జిల్లా కేంద్రంలోని ఎన్ఎంఆర్ గార్డెన్‌లో మంగళవారం టీఎస్‌జీఆర్‌ఈఏ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే వేడుకలను నిర్వహించారు. అసోసియేషన్ నాయకుడు ఎన్ మహేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునాలింగయ్య మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం 40 మంది విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ విష్ణువిర్ధన్‌రెడ్డి, బాలయ్య, లక్ష్మయ్య, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రాజేశ్‌చంద్ర, మహబూబ్‌రెడ్డి, జగదీశ్వరాచారి, నర్సింహారెడ్డి, జానీమియా, రామన్న, యాదవరెడ్డి, శోభ, శంకరయ్య, హేమలత, ఉమ, సుచిత్ర, జమున పాల్గొన్నారు.

భూమికి రిజిస్ట్రేషన్ చేయకుండా బెదిరింపులు

రెవెన్యూ అధికారుల తీరుపై బాధితుల ఆవేదన

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 26 : ఒప్పందం చేసుకున్న భూమిని తనకు కాకుండా రెవెన్యూ అధికారులు బెదిరింపులకు గురి చేస్తున్నారని బాధితులు ఆవేదన చెందారు. వివరాల్లోకి వెళ్తే.. చిల్పూరు మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన కుంచం కార్యవర్ధి రాజుకు ఇదే గ్రామానికి చెందిన పసునూరి నరేందర్‌రెడ్డి 2011లో సర్వే నంబర్ 180/A/4/4 లో ఎకరానికి రూ.1.20 లక్ష చొప్పున ఎకరం, తన మామ శివరాత్రి రాజయ్యకు మరో ఎకరం భూమిని విక్రయించాడు. లక్ష రూపాయలు చెల్లించి, మిగతా 20 వేలు రిజిస్ట్రేషన్ సమయంలో చెల్లిస్తామని ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో కార్యవర్ధి రాజు, చిన్న రాజయ్య భూమిని సాగు చేసుకుంటున్నారు. తాము కొనుగోలు చేసిన భూమిని రిజిస్ట్రేషన్ చేయమని నరేందర్ రెడ్డిని కోరగా తన తండ్రి లక్ష్మారెడ్డి పేరున ఉందని, తన పేరుపై మార్చాక చేస్తానని చెప్పాడు. 2014 తరువాత నరేందర్‌రెడ్డి పేరుపై ఆస్తి మార్పిడి జరిగినా తమకు రిజిస్ట్రేషన్ చేయకపోగా ములుగు జిల్లా బుస్సాపూర్ గ్రామానికి చెందిన వినోదకు విక్రయించాడు. విషయం తెలుసుకున్న వీరు నాటి స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో రమేశ్‌కు ఫిర్యాదు చేయడంతో దీనిని పెండింగ్‌లో పెట్టారు. నరేందర్‌రెడ్డికి పాస్‌బుక్‌లు ఇవ్వాలంటే మీరు సంతకం చేయాలని చిల్పూరు తహసీల్దార్, డీఐ, ఆర్‌ఐలు తమను బెదిరింపులకు గురి చేస్తున్నారని కార్యవర్ధి రాజు ఆవేదన వ్యక్తం చేశాడు. నరేందర్‌రెడ్డి వద్ద నుంచి భూమిని ఇప్పించాలని ఆయన అధికారులను కోరారు.

కోర్టు ఆదేశాల మేరకు నోటీసులు..

-సరస్వతి, చిల్పూరు తహసీల్దార్

నరేందర్‌రెడ్డి వద్ద 2011లో కార్యవర్ధి రాజు భూమి కొనుగోలు చేసినా పూర్తిగా డబ్బులు చెల్లించలేదు. వారు రాయించుకున్న పత్రం అగ్రిమెంట్ మాత్రమే. రాజు కలెక్టర్‌కు, సీపీకి ఫిర్యాదు చేశారు. దీనిపై నెల రోజుల్లో సమస్యను పరిష్కరించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చింది. దీంతో నరేందర్‌రెడ్డి, రాజు, వినోదకు నోటీసులు ఇచ్చాము. వారు సంజాయిషీ ఇవ్వాలి. రాజును మేము బెదిరించలేదు.

108 బంగారు పద్మాలతో పూజలు

వేంకటేశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

చిల్పూరు, డిసెంబర్ 26 : మండల కేంద్రంలోని బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయంలో అష్టాదశ పాద పద్మారాధన పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. తిరుపతిలో జరిగినట్లుగా 108 బంగారు పుష్పాలతో అర్చకులు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఈవో లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ ప్రతి మంగళవారం స్వామివారికి అష్టాదశ పాద పద్మారాధన పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పూజకు రూ.516 చెల్లించాలని భక్తులకు సూచించారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత దాత సంగోజు లక్ష్మీమోహన్‌చారి దంపతులు, వెంకటేశ్వరపల్లె సర్పం చ్ తోకల దివాకర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్‌శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, సిబ్బంది రమేశ్, వీరన్న, కృష్ణ, మహేశ్, మల్లికార్జున్, విశాల్, రాజశేఖర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

క్షీరగిరి క్షేత్రంలో గిరి ప్రదక్షిణ

పాలకుర్తి, డిసెంబర్ 26 : మండల కేంద్రంలోని స్వయంభు సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి క్షీరగిరి క్షేత్రంలో మంగళవారం తెల్లవారుజామున గిరిప్రదక్షిణ నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకొని ఉమ్మడి వరంగల్ జిల్లా నలుమూలల నుంచేగాక పొరుగు జిల్లాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి స్వాగత తోరణం నుంచి ఓంకారేశ్వరస్వామి ఆలయం గుట్ట చుట్టూ గిరిప్రదక్షిణ కొనసాగించారు. అందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

నర్మెట : ఆర్థిక సాయం అందిస్తున్న సర్పంచ్ కమలాకర్‌రెడ్డి

నర్మెట, డిసెంబర్ 26: మండల కేంద్రానికి పులి భద్రయ్య, బైరోజు రాములు మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి మృతుల కుటుంబాలను పరామర్శించి రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. పరామర్శించిన వారిలో వార్డు సభ్యులు గొడుగు రవి, పాతూరి శేఖర్, పులి నర్సింహులు, పీ బాలకృష్ణ ఉన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట : మండలంలోని పోచన్నపేటకు చెందిన కర్రె కమలమ్మ ఇటీవల మృతి చెందారు. మృతురాలి కుటుంబాన్ని మంగళవారం సామాజిక సేవా కార్యకర్త పోతుల రాములు పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు. తుప్పతి చంద్రయ్య, బుడిగ రామచంద్రం, బాబు, సత్యనారాయణ, నర్సింహులు తదిత రులు పాల్గొన్నారు.

రఘునాథపల్లిలో.

రఘునాథపల్లి : భాంజీపేటకు చెందిన కల్లుగీత కార్మికుడు మాటూరి రమేశ్ ప్రమాదవశాత్తు సోమవారం తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య మంగళవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి, కుటుంబ సభ్యుల్లో ఒకరి ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు గైని శ్రీనివాస్, వడ్లకొండ వెంకటేశ్, బసవగాని మహేందర్, పగిడిపల్లి రాజు, బాల్నె రాజయ్య, బుర్ర లక్ష్మీనారాయణ, కుర్ర రాజు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 26 : అప్పులబాధతో ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని మీదికొండలో జరిగింది. సీఐ సట్ల రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మీదికొండకు చెందిన శివరాత్రి చేరాలు కుమారుడు మధు(38) ఏడాదిగా హైదరాబాద్‌లో కూలి పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం మీదికొండకు వచ్చాడు. మంగళవారం ఉదయం మధు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు బాధితుడిని చికిత్స కోసం ఎంజీఎం దవాఖానకు తరలించగా మృతి చెందాడని సీఐ సట్ల రాజు తెలిపారు.